


EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
27-10-2025
పేజీలు: 02



## తెలంగాణలోని ఈ జిల్లాల్లో ఊహించని వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. రుతుపవనాల తిరోగమనం సమయంలో ఇలాంటి తుపానులు ఏర్పడటం సర్వసాధారణం అయినప్పటికీ.. ఈసారి ఏర్పడుతున్న ఈ తుపాను కారణంగా తూర్పు , ఉత్తర తెలంగాణ జిల్లాలపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదికల ప్రకారం.. తెలంగాణలో వర్షాల తీవ్రత, విస్తీర్ణం ఈ విధంగా ఉన్నాయి. అక్టోబర్ 28న.. అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాలు.. భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్. ఇక భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాలు.. కొమురంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, ఖమ్మం, వరంగల్ . అక్టోబర్ 29న రెండో రోజున కూడా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ రోజున ఆదిలాబాద్, కొమురంభీం, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయి. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున.. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ , జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు తడిసిపోయే ప్రమాదం ఉన్నందున.. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు. ఈ రెండు రోజుల్లో ప్రజలు అనవసర ప్రయాణాలను రద్దు చేసుకోవాలని సూచించారు. చేపలు పట్టేందుకు వెల్లే మత్స్యకారులు ఈ రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను కదలికను బట్టి.. మరిన్ని హెచ్చరికలు ఎప్పటికప్పుడు జారీ చేస్తామని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# రోడ్డు పక్కన పాత వాహనాలు.. ఇక కనపించవ్!

### జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం

హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య, పరిశుభ్రత లోపాలను పరిష్కరించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కీలకమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. నగర రోడ్లపై ఏండ్ల తరబడి నిరుపయోగంగా పడి ఉన్న పాత వాహనాలను తొలగించడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించింది. పాత వాహనాలను రోడ్ల పక్కన, అండర్‌పాస్‌ల కింద లేదా గల్లీల్లో వదిలేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిరుపయోగంగా ఉన్న ఈ వాహనాలు పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు.. ట్రాఫిక్ జామ్‌లకు కారణమవుతున్నాయి. ఈ వాహనాల చుట్టూ దుమ్ము, ధూళి, చెత్త పేరుకుపోయి.. పరిసరాలు అపరిశుభ్రంగా మారి.. దోమలకు, క్రిములకు ఆలయంగా మారుతున్నాయి. ఈ సమస్యలన్నింటినీ సమగ్రంగా పరిష్కరించే ఉద్దేశంతో.. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఈ తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. పాత బండ్లను తొలగించే డ్రైవ్‌ను ప్రారంభించడానికి ముందుగా.. గ్రేటర్ పరిధిలో ఎన్ని పనికిరాని వాహనాలు ఉన్నాయో తెలుసుకోవడానికి సర్వే నిర్వహించాలని బల్దియా నిర్ణయించింది. ఈ డ్రైవ్‌లో పోలీస్ శాఖ సహకారాన్ని కూడా తీసుకోనున్నారు. ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీసులు సహాయంతో.. వాహనాల యజమానులను గుర్తిస్తారు. వీటితో పాటు.. నోటీసులు జారీ చేయడం, ఆ తర్వాత వివాదాలకు తావులేకుండా వాహనాలను తరలించడం వంటి చర్యలు చేపట్టనున్నారు. ద్వి చక్ర వాహనాల దగ్గర నుంచి .. హెవీ వెహికల్స్ వరకు.. ఏ ఒక్క వాహనం కూడా రోడ్డు పక్కన నిరుపయోగంగా కనపడితే.. వాటిని తొలగించాలని అధికారులు నిర్ణయించారు. పెద్ద వాహనాలను ఎత్తడానికి జీహెచ్ఎంసీ వద్ద సరైన సామగ్రి లేకపోవడంతో.. సర్కిల్ స్థాయి డిప్యూటీ కమిషనర్‌లు ట్రాఫిక్ పోలీసుల సహాయాన్ని కోరారు. సేకరించిన వాహనాలను దుండిగల్‌లోని యార్డ్‌తో పాటు మరికొన్ని శివారు ప్రాంతాలకు తరలించి.. కొన్నాళ్లకు వాటిని తుక్కుగా మారుస్తారు.





### యజమానులకు విజ్ఞప్తి..

20 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరుపయోగంగా ఉన్న వాహనాల యజమానులు తమంతట తామే వాటిని స్క్రాప్ చేసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. యజమానులు స్వచ్ఛందంగా స్క్రాప్ చేయడం వల్ల ఎంతో కొంత నగదు (Cash) పొందే అవకాశం ఉంటుంది. అలా కాకుండా రోడ్లపై వదిలేస్తే.. జీహెచ్ఎంసీ డ్రైవ్‌లో వాటిని తొలగిస్తుంది. దీనివల్ల యజమానులు ఆర్థికంగా నష్టపోతారు. ఈ ప్రత్యేక కార్యాచరణ ద్వారా హైదరాబాద్ నగర రోడ్లను ట్రాఫిక్ రహితంగా.. పరిశుభ్రంగా ఉంచాలని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది.



## యూపీఎస్సీ అభ్యర్థి హత్య కేసులో.. లివిన్ పార్ట్నర్‌తో పాటు మరో ఇద్దరి అరెస్టు

ఢిల్లీలోని గాంధీ విహార్ ఏరియాలో యూపీఎస్సీ ప్రిపేరవుతున్న 32 ఏళ్ల అభ్యర్థి అనుమానాస్పద రీతిలో మృతిచెందిన విషయం తెలిసిందే. రాంకేశ్ మీనా అనే వ్యక్తి తన ఫ్లాట్‌లో మంటల్లో కాలి ప్రాణాలు విడిచాడు. అయితే ఈ కేసులో ఢిల్లీ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. అతనితో సహజీవనం చేస్తున్న అమ్మాయితో పాటు మర్డర్‌లో భాగమైన మరో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు. ఫోరెన్సిక్ సైన్సులో బీఎస్సీ చదువుతున్న 21 ఏళ్ల అమ్మాయిని, ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్‌ను, అతని స్నేహితుడిని అరెస్టు చేశారు. వీళ్లంతా యూపీలోని మొరాదాబాద్ నివాసితులు. బాధిత వ్యక్తితో యూపీ మహిళ గత కొన్నాళ్ల నుంచి లివిన్ రిలేషన్‌లో ఉన్నది. అయితే మరో ఇద్దరితో కలిసి యూపీఎస్సీ ప్రిపేరవుతున్న మీనా అనే వ్యక్తిని హత్య చేయించింది. ఆ హత్యను అగ్నిప్రమాదంగా చిత్రీకరించేలా ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. గాంధీ విహార్ బిల్డింగ్‌లోని నాలుగవ అంతస్తులో రాంకేశ్ మీనా నివాసం ఉంటున్నాడు. అక్టోబర్ 6వ తేదీన ప్రమాదం జరిగినట్లు పోలీసులకు సమాచారం వెల్లింది. ఏసీ బ్లాస్ట్ కావడం వల్ల అగ్ని ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. అయితే మంటల్ని ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఓ కాలిన మృతదేహాన్ని గుర్తించారు. ఈ ఘటనలో కేసు నమోదు చేసిన పోలీసులు ఆ తర్వాత దర్యాప్తు చేపట్టారు.

## తాగి బండి నడిపేవారు టెర్రరిస్టులతో సమానం అన్న సజ్జనార్



మద్యం సేవించి వాహనాలు నడిపేవారు టెర్రరిస్టులతో సమానమని సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై వారి చర్యలు ఉగ్రవాద చర్యల కన్నా ఏమాత్రం తక్కువ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 20 మంది ప్రాణాలను బలిగొన్న కర్నూలు బస్సు ప్రమాదం నిజానికి ప్రమాదం కాదని, అది ఒక తాగుబోతు బైకర్ నిర్లక్ష్యం వల్ల జరిగిన దారుణ మారణకాండ అని ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. కర్నూలు ప్రమాద ఘటన వివరాలను సజ్జనార్ పంచుకున్నారు. బి. శివ శంకర్ అనే బైకర్ మద్యం మత్తులో తన బైక్‌పై నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని తెలిపారు. తెల్లవారుజామున 2:24 గంటలకు ఓ పెట్రోల్ బంకులో బైక్‌లో ఇంధనం నింపుకున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో నమోదయ్యాయని, సరిగ్గా 2:39 గంటలకు ఈ ఘోర ప్రమాదం జరిగిందని ఆయన వివరించారు. అతని బాధ్యతారాహిత్యం క్షణాల్లో ఎన్నో కుటుంబాలను సర్వనాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు."మద్యం తాగి వాహనాలు నడిపేవారు ప్రతీ విషయంలోనూ టెర్రరిస్టులే. నేను నా మాటకు కట్టుబడి ఉన్నాను. వారు ప్రాణాలను, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తారు. ఇలాంటి చర్యలను ఎప్పటికీ సహించబోం," అని సజ్జనార్ స్పష్టం చేశారు.ఇకపై హైదరాబాద్‌లో డ్రంక్ డ్రైవింగ్‌పై జీరో టాలరెన్స్ విధానాన్ని అవలంబిస్తున్నట్లు సజ్జనార్ ప్రకటించారు. మద్యం మత్తులో పట్టుబడిన ప్రతి ఒక్కరూ చట్టం యొక్క పూర్తి పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. అమాయకుల జీవితాలను ప్రమాదంలో పడేసే వారి పట్ల ఎలాంటి కనికరం, మినహాయింపులు ఉండవని తేల్చిచెప్పారు. డ్రంక్ డ్రైవింగ్‌ను ఒక పొరపాటుగా చూడటం సమాజం మానుకోవాలని, అది జీవితాలను నాశనం చేసే నేరమని, దానికి తగ్గ శిక్ష కచ్చితంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## చనిపోయిన కొడుకు.. తిరిగి వస్తాడని తండ్రి వింత పని



తల్లిదండ్రులకు బిడ్డలపై ఎంతో ప్రేమ ఉంటుంది. వారిని ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తారు. పిల్లలకు ఏ చిన్న దెబ్బ తగిలిన అల్లాడి పోతుంటారు. ఇక ఏదైనా ప్రమాదం జరిగి తమ నుంచి బిడ్డ శాశ్వతంగా దూరమైతే తట్టుకోలేరు. అలానే తాజాగా ఓ తండ్రి చనిపోయిన తన కొడుకు బతికి వస్తాడని ఓ వింత పని చేశాడు. మూడు రోజుల పాటు శవంకు పూజలు చేశాడు. ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లా ఇటార్ని గ్రామానికి చెందిన నరేంద్ర తన కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నెల 20వ తేదీన చిన్న కొడుకు కపిల్(12) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే కపిల్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఇంతలో స్థానిక భూత వైద్యుడు పాము విషాన్ని బయటకు తీసి కపిల్‌ను బ్రతికించగలడని ఎవరో నరేంద్ర కుటుంబానికి చెప్పారు. వారి మాటలు నమ్మిన నరేంద్ర.. కొడుకు మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చిన తర్వాత స్థానిక భూత వైద్యుడిని పిలిచాడు. ఆ వ్యక్తి గ్రామానికి వచ్చి వివిధ పూజలు చేశాడు. కానీ ఫలితం లేకపోవడంతో మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే, మరుసటి రోజు నరేంద్ర మరొక భూత వైద్యుడిని తీసుకువచ్చాడు. పూడ్చిపెట్టిన కపిల్ మృతదేహాన్ని బయటకు తీసి.. నాలుగు రోజుల పాటు వివిధ పూజలు చేయించాడు. వారి ప్రయత్నాలేవీ కూడా ఫలించలేదు. దీని గురించి పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం పరీక్ష కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలానే ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



## నెల రోజుల తర్వాత.. కరూర్ బాధితులను కలిసిన విజయ్

తమిళనాడు కరూర్‌లో టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ నిర్వహించిన ప్రచార ర్యాలీలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా.. సుమారు 60 మంది గాయపడ్డారు. ఈ ఘటన జరిగిన నెల రోజుల తర్వాత బాధిత కుటుంబాలను విజయ్ నేడు కలిశారు. మహాబలిపురంలోని ఓ రిసార్ట్‌లో బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. మృతులకు చెందిన 37 కుటుంబాలతో సహా 200 మందితో భేటీ అయ్యారు. ఈ మీటింగ్ కోసం టీవీకే దాదాపు 50 రూమ్స్‌ను బుక్ చేసింది. కరూర్‌తోపాటు ఇతర జిల్లాల్లో ఉన్న బాధిత కుటుంబాలను ప్రత్యేక బస్సుల్లో హోటల్‌కు తరలించారు. అక్కడ వారితో విజయ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రతీ కుటుంబం నుంచి నాలుగు నుండి ఐదుగురు వ్యక్తులు విజయ్‌ను కలవడానికి వచ్చారు. ప్రతి ఒక్కరినీ విజయ్ వ్యక్తిగతంగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇక ఈ భేటీకి మీడియా సహా ఇతరులను అనుమతించలేదు. 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్త పార్టీని స్థాపించిన విజయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం మొదలుపెట్టారు. గత నెల 27న కరూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 మంది గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చింది. ఇక మృతుల కుటుంబాలకు టీవీకే ఆర్థిక సాయంగా రూ.20 లక్షలు అందజేసిన విషయం తెలిసిందే.



## ఆ డైట్ అస్సలు పాటించకండి అంటున్న మాళవిక

హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో రాబోతున్న ఈ సినిమా పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది.అయితే ఓ సినిమా కోసం మాళవిక కేవలం రెండు వారాల్లోనే 8 కిలోల బరువు పెరిగిందట. అంతకు ముందు 14 రోజుల్లోనే బరువు తగ్గింది. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక.. తన ఫిట్నెస్ సీక్రెట్ రివీల్ చేసింది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## యూఏఈలో పదేళ్ల పాటు ఉచితంగా ఉండేందుకు అవకాశం....
# బంపర్ ఆఫర్ కొట్టేసిన తెలంగాణ యూట్యూబర్

తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందిన ఒక యువకుడు తన సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని పొందారు. గోదావరిఖనిలోని యైటింక్లైన్ కాలనీకి చెందిన సయ్యద్ హఫీజ్ కు ఏకంగా యూఏఈ గోల్డెన్ వీసా లభించింది. సింగరేణి కార్మికుడి కుటుంబం నుంచి వచ్చి, ఉన్నత విద్య చదవకపోయినా.. తన సొంత టాలెంట్ తో ఈ స్థాయికి ఎదగడం తెలంగాణ వాసులకు గర్వకారణంగా నిలిచింది.

**తెలుగు టెక్ ట్యూట్స్..**

సయ్యద్ హఫీజ్ 2011లోనే 'తెలుగు టెక్ ట్యూట్స్' పేరుతో తన యూట్యూబ్ ఛానెల్‌ను ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ సుపరిచితులైన హఫీజ్.. తన వీడియోల ద్వారా డిజిటల్ స్టార్‌గా ఎదిగారు. ప్రధానంగా మొబైల్ ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల గురించి సమగ్రంగా వివరిస్తారు. కొత్త ఫోన్ల అన్‌బాక్సింగ్ .. వాటి ప్రత్యేకతలు,



లాభనష్టాలు, అప్‌డేట్స్‌లోని పాజిటివ్, నెగటివ్ అంశాలను ప్రజల ముందు ఆవిష్కరిస్తారు. సుమారు 1.8 మిలియన్లకు (1.79 మిలియన్లు) పైగా సబ్‌స్క్రైబర్లు కలిగి ఉన్న ఈ ఛానెల్ ద్వారా హఫీజ్ 4.2 వేలకు పైగా వీడియోలను అందించి మన్ననలు పొందారు. ప్రస్తుతం యూట్యూబ్ ద్వారా ఆయన నెలకు రూ. 2 లక్షలకు పైగా ఆదాయాన్ని పొందుతున్నారు. హఫీజ్ డిజిటల్ ప్రయాణం కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాలేదు. 2022లో ఫోర్బ్స్ ఇండియా ప్రకటించిన టాప్ 100 డిజిటల్ స్టార్స్ జాబితాలో సయ్యద్ హఫీజ్ 32వ స్థానంలో నిలిచారు.

## బంగాళాఖాతంలో
# మొంథా తుపాను తెలంగాణపై ప్రభావం


### పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. రేపు, ఎల్లుండి తేదీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాలపై తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని స్పష్టం చేసింది. మంగళవారం రాత్రి ఏపీలోని కాకినాడ సమీపంలో ఈ తుపాను తీరం దాటే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. 5 సెం.మీ. నుంచి 20 సెం.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే ఛాన్స్ ఉందని హెచ్చరించింది. ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేసింది.వాతావరణ శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, రేపు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇదే రోజున కొమురంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు నమోదవుతాయని అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఎల్లుండి కూడా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కొమురంభీం, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయని తెలిపింది. తుపాను



తీవ్రత దృష్ట్యా రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, జిల్లా యంత్రాంగాలు పూర్తి సన్నద్ధతతో ఉండాలని సూచనలు జారీ చేశారు.ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అధికారులు కోరారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను కాపాడుకోవడానికి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది. మత్స్యకారులు రెండు రోజుల పాటు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. మొంథా తుపాను కదలికలను నిరంతరం గమనిస్తున్నామని, ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తామని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

## కార్తిక సోమవారం.. పంచాక్షరి మంత్రంతో
# మారుమ్రోగుతున్న శైవ క్షేత్రాలు



రాష్ట్ర వ్యాప్తంగా శైవ క్షేత్రాలు కార్తిక శోభను సంతరించుకున్నాయి. కార్తిక మాసం తొలి సోమవారం కావడంతో మహాశివుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే శివయ్యను దర్శించుకుని, ఆలయాల్లో కార్తిక దీపాలను వెలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో 'ఓం నమఃశివాయా' పంచాక్షరీ మంత్రంతో మారుమ్రోగుతున్నాయి. ఆది దేవుడి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేములవాడ, కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం, నల్లగొండ ఛాయా సోమేశ్వర ఆలయం, చెర్వుగట్టుతోపాటు హైదరాబాద్‌లోని శైవ క్షేత్రాల్లో భక్తుల రద్దీ నెలకొన్నది. కార్తిక సోమవారం ఉపవాసం ఆచరించిన వ్యక్తికి కైలాస ప్రవేశం ఉంటుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. కార్తీక సోమవారం వత్రం చేయడం వల్ల సకల పాపాలు తొలగిపోయి.. కుటుంబంలో సుఖసంతోషాలు, అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని.. వివాహం కానీ స్త్రీలకు మంచి భర్త వస్తారని.. వివాహమైన వాళ్లకు మాంగల్య బలం పెరుగుతుందని నమ్మకం. ఇక ఈరోజున కార్తీక సోమవారం కథ విన్నా, చదివినా విశేషమైన పుణ్య ఫలం దక్కుతుందని భక్తుల విశ్వాసం.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికతో బీఆర్ఎస్
# రాజకీయ సమాధి తప్పదన్న మంత్రి తుమ్మల

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరగబోయే ఉపఎన్నికతో బీఆర్ఎస్ కథకు చరమగీతం పాడబోతున్నామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చారిత్రక తీర్పు ఇచ్చి, బీఆర్ఎస్‌ను రాజకీయంగా సమాధి చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నాడు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా వెంగళరావునగర్ డివిజన్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా విధ్వంసానికి గురైందని ఆరోపించారు. "బీఆర్ఎస్ పాలన అంటేనే అవినీతి, అణచివేత. ఇప్పుడు ఆ పార్టీకి శాశ్వతంగా ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. ఈ ఉపఎన్నికలో బీఆర్ఎస్‌ను పూర్తిగా తిప్పికొట్టాలి" అని ఆయన కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని ఒక 'మినీ ఇండియా'గా తీర్చిదిద్దేందుకు



అద్భుతమైన దార్శనికతతో పనిచేస్తున్నారని తుమ్మల ప్రశంసించారు. జూబ్లీహిల్స్ ఓటర్లు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఈ ప్రగతిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి" అని అన్నారు.



## అద్భుత ఉపాయం..
# చెట్టు కొమ్మలతో ఆదాయం

నిరుద్యోగ యువతకు అనంతమైన అవకాశాలను అందిస్తూ.. ప్రకృతి మరోసారి తన ఔదార్యాన్ని చాటుకుంటోంది. సాధారణంగా రహదారుల వెంట కనిపించే నిద్ర గన్నేరు లేదా రెయిన్ ట్రీ చెట్లు ఇప్పుడు నిరుద్యోగులకు ఆదాయ వనరుగా మారుతున్నాయి. ఈ చెట్ల కొమ్మలపై పేరుకుపోయే ఒక ప్రత్యేకమైన జిగురు పదార్థం ద్వారా నిజామాబాద్ వంటి ప్రాంతాల యువత జీవనోపాధిని పొందుతున్నారు.

**జిగురు ఉత్పత్తి..**

నిద్ర గన్నేరు చెట్లపై జరిగే ఒక ప్రత్యేక జీవ ప్రక్రియ ద్వారా ఈ విలువైన జిగురు తయారవుతుంది. ఈ చెట్ల కొమ్మలపై కొన్ని కీటక జాతుల సంచారం ఉంటుంది. ఈ కీటకాలు విడుదల చేసే తెల్లటి విసర్జితాలు క్రమంగా కొమ్మలపై గట్టిపడతాయి. అవి గట్టిపడిన తరువాత చిన్న ముద్దలాగా లేదా తెల్లటి పొరలాగా పేరుకుపోతాయి. వృక్షశాస్త్ర అధ్యాపకుల ప్రకారం.. ఈ చెట్టు శాస్త్రీయ నామం సమనియే సమన్ లేదా ఆఫ్రికాకు చెందిన రెయిన్ ట్రీ. ఈ జిగురును కొందరు రోగనిరోధక ఔషధాల తయారీలో కూడా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.



# హాట్ నెస్‌కు కేరాఫ్ అడ్రస్

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. పెళ్లి చేసుకొనో.. లేక అవకాశాలు లేక సినిమాలకు దూరం అయ్యారు. ఒక ముద్దుగుమ్మ తెలుగులో రెండే సినిమాలు చేసింది. అందులో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది. అలాగే ఆమె ఆస్తి పాస్తులు కూడా కోట్లల్లో ఉన్నాయి. అంతే కాదు ఇండస్ట్రీలో ఆమెను మించిన హాట్ బ్యూటీ లేదు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా..? ఇండస్ట్రీలో హాట్ బ్యూటీగా పేరు తెచ్చుకుంది ఆమె.. అందంలో అప్సరస.. కానీ తెలుగులో చేసిన సినిమాలు మాత్రం రెండు సినిమాలే ఒకటి డిజాస్టర్, మరో సినిమా భారీ హిట్. ఆమె ఎవరో కాదు దిశా పటాని. ఈ హాట్ బ్యూటీ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు.

# తెలంగాణ రాష్ట్రంలో.. రేపే 2,620 మద్యం షాపులకు లక్కీ డ్రా

తెలంగాణ రాష్ట్రంలో మద్యం దుకాణాల నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాలకు లక్కీ డ్రా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపు ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా ఈ డ్రా ప్రక్రియ జరగనుంది. మద్యం షాపుల డ్రాకు తెలంగాణ హైకోర్టు కూడా అనుమతి ఇవ్వడంతో.. ఈ ప్రక్రియకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి.

**రాష్ట్రవ్యాప్తంగా అంచనాలను మించిన స్పందన..**

ఈసారి మద్యం దుకాణాల టెండర్లకు రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని అందించింది. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 2,620 దుకాణాలకు గాను ఏకంగా 95,137 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వం రూ. 3 లక్షల నాన్-రిఫండబుల్ ఫీజును వసూలు చేసింది. ఈ రికార్డు స్థాయి దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.2854.11 కోట్లు ఆదాయం వచ్చింది. 2023 సంవత్సరంలో దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు ఉండగా.. లక్షా 32 వేలకుపైగా దరఖాస్తులు వచ్చి రూ.2,640 కోట్లు




ఆదాయం వచ్చింది. ఈ సారి దరఖాస్తుల సంఖ్య తగ్గినా ఫీజు ఎక్కువగా ఉండటంతో.. గతం కంటే కూడా ఈసారి అదాయం ఎక్కువగానే సమకూరింది.

**జీహెచ్ఎంసీ పరిధిలో పోటీ...**

హైదరాబాద్ , గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో పోటీ తీవ్రంగా ఉంది. ఎక్కువ జనాభా, విస్తృత మార్కెట్ కారణంగా ఇక్కడ డిమాండ్ ఎక్కువగా ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలోని 639 షాపులకు గాను ఏకంగా 34,958 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ. 1,048.74 కోట్ల ఆదాయం లభించింది. హైదరాబాద్ లో 80 లిక్కర్ షాపులకు 3,201 దరఖాస్తులు వచ్చాయి. సికింద్రాబాద్ ప్రాంతంలోని 99 షాపులకు 3,022 మంది దరఖాస్తు చేసుకున్నారు. కేవలం జంట నగరాల నుంచే రూ. 186.69 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరింది. ఎక్కువగా రంగారెడ్డి జిల్లా పరిధిలో మొత్తం 29,420 దరఖాస్తులు రాగా.. అతి తక్కువగా ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో వచ్చాయి. ఎక్సైజ్ శాఖ అధికారులు అన్ని జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో పారదర్శకతతో లక్కీ డ్రా నిర్వహించి, కొత్త మద్యం దుకాణాల యజమానులను ప్రకటించనున్నారు.



# ఆరుగురికి ప్రాణం పోసిన రమ్యశ్రీ

మానవత్వం, దాతృత్వం మూర్తీభవించిన అద్భుత ఘట్టం హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. కేవలం 28 ఏళ్ల చిన్న వయసులోనే బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించబడిన ఓ గృహిణి.. అవయవ దానం ద్వారా ఏకంగా ఆరుగురు ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలకు కొత్త వెలుగును ప్రసాదించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామానికి చెందిన బండిగారి రమ్యశ్రీ అనే గృహిణి ఈ అరుదైన దాతృత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. రమ్యశ్రీ ఈ నెల 21వ తేదీన తన ఇంట్లో ఉన్న సమయంలోనే హఠాత్తుగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో వైద్యులు అన్ని రకాల చికిత్సలు అందించినప్పటికీ.. రమ్యశ్రీ కోలుకోలేకపోయారు. చివరికి, ఆమె బ్రెయిన్‌డెడ్ (జీవన్మృతురాలు) అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ హృదయవిదారక విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ వైద్య బృందం రమ్యశ్రీ భర్త రాజలింగం, వారి కుటుంబ సభ్యులను సంప్రదించింది. వారు విషాదంలో ఉన్నప్పటికీ, అవయవదానం యొక్క ప్రాముఖ్యత, అది ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టగల అద్భుత అవకాశం గురించి జీవన్‌దాన్ బృందం సున్నితంగా వారికి వివరించింది.